ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 7 ఏప్రిల్ 2024



గూడూరు మండలం మదనాపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై మాట్లాడుతున్న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి


దేవాలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు..

7

- సర్వప్రాణులు దైవస్వరూపమే..
- బుద్ధిని బట్టి మనిషి ఉన్నతమైన ప్రాణిగా రూపొందాడు..
- ఆధ్యాత్మిక కేంద్రాలే.. పరివర్తన క్షేత్రాలు..
- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి



గామి చిత్ర బృందంతో మాటామంతీ



హంగర్ గేమ్ మాస్టర్ చెఫ్ ఈవెంట్

జోరుగా హుషారుగా..

7

- రెండో రోజు కొనసాగిన స్ప్రింగ్ స్ప్రీ
- నిట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- ఆకట్టుకున్న పలు కార్యక్రమాలు, గేమ్స్
- అలరించిన సినీ నిర్మాత, డైరెక్టర్ల టాక్ షో..

నిర్మాణ రంగం కుదేలు!

- భారీగా పెరిగిన సామగ్రి ధరలు
- టన్ను ఇసుక రూ.2వేల పైమాటే..
- కృత్రిమ కొరతతో భారీగా పెరుగుతున్న రేటు
- సిమెంట్, స్టీల్, కంకర, ఇటుక, కరెంట్ సామగ్రి ధరలదీ అదే పరిస్థితి
- భారీగా పెరిగిన దినసరి కూలీ, మేస్త్రీ కూలి రేట్లు
- సామాన్యుల సొంతింటి కలలపై ధరల దరువు
- ముందుకు సాగని అభివృద్ధి పనులు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

నిర్మాణరంగంపై ధరలు దరువేస్తున్నాయి. అకాశాన్నంటిన నిర్మాణ సామగ్రి ధరలతో సామాన్యుడే కాదు బడా బిల్డర్లు కూడా భయపడే పరిస్థితి నెలకొంది. ఇసుక.. స్టీల్, సిమెంట్, ఇటుక, కంకర, కరెంట్ సామగ్రి.. ఇలా అన్నింటి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇప్పటికే నిర్మాణ పనులు మొదలు పెట్టినా పెరిగిన ధరలతో ఎక్కడి పనులు అక్కడే నిలిపి వేయాల్సిన దుస్థితి ఏర్పడింది. సామగ్రితో పాటు రోజు వారి కూలీలకు, మేస్త్రీకి ఇచ్చే కూలీ రేట్లు కూడా పెరిగిపోతున్నాయి. దీంతో నిర్మాణం రంగం కుదేలవుతుంది.

భవన నిర్మాణ రంగంపై పెరిగిన సామగ్రి ధరలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. రెండు నెలలుగా ధరలు ఒకదానికంటే మరొకటి పోటీ పడి ధర పెరుగుతుండటంతో సొంతింటి కల కోసం తాపత్రాయ పడే సామాన్యులతో పాటు భారీ భవనాలు నిర్మించే బిల్డర్ల వరకు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి నిర్మాణంలో కీలకమైన ఇటుక ధరలు అకాశాన్నంటుతున్నాయి. లైట్ వెయిట్ మట్టి ఇటుకలకు ట్రాక్టర్ (2వేల) మొన్నటి వరకు రూ.15,000 వరకు తీసుకునేవారు. ప్రస్తుతం నిర్మాణాలు ఊపందుకోవటంతో వ్యాపారులు ధరలను భారీగా పెంచారు. ప్రాంతాన్ని బట్టి 2వేల ఇటుకలు ఉండే ట్రాక్టర్ లోడ్‌కు రూ.19వేల నుంచి రూ.21వేల వరకు విక్రయిస్తున్నారు. ఒక ట్రాక్టర్‌కే నాలుగు వేల నుంచి ఆరు వేల రుపాయలకు అదనపు భారం పడుతోంది. అలాగే స్టీల్ (ఇనుప చువ్వలు) ధరలు రోజుకో రేటుతో సామాన్యుడిని ముప్పుతిప్పలకు గురి చేస్తున్నాయి. ఐఎస్‌ఐ ముద్ర గల బ్రాండెడ్ స్టీల్ టన్నుకు రూ.4,200 నుంచి రూ.5వేల వరకు విక్రయించారు. అయితే ప్రస్తుతం బంగారం ధరల మాదిరిగానే స్టీల్ ధరలు రోజుకో ధర తెరపైకి తెస్తున్నారు. ప్రస్తుతం బ్రాండెడ్ స్టీల్ టన్ను (బార్) కు రూ.5,000 నుంచి రూ.7,500 వరకు విక్రయిస్తున్నారు. కొంచెం తక్కువ నాణ్యత గల స్టీల్ టన్నుకు రూ.4,500 నుంచి రూ.6,200 వరకు విక్రయిస్తున్నారు. రోజు రోజుకు స్టీల్ ధరలు మారుతుండటంతో ఏ రోజు పెరుగుతుందో.. ఏ రోజు తగ్గుతుందో తెలియక సామాన్యులు స్టీల్ కొనుగోలులో గందరగోళానికి గురవుతున్నారు. దీంతో స్టీల్‌పై టన్నుకు అదనంగా రూ.1,200 నుంచి రూ.2వేల వరకు భారం మోయాల్సి వస్తోందని నిర్మాణదారులు వాపోతున్నారు.



సిమెంట్, ఇసుక బంగారమాయే...

నిర్మాణంలో కీలకమైన ఇసుక, సిమెంట్ ధరలకు రెక్కలొచ్చాయి. రెండు, మూడు నెలల క్రితం టన్ను ఇసుకను వరంగల్ మార్కెట్‌లో రూ.700 నుంచి రూ.850 వరకు విక్రయించారు. అయితే ఇటీవల కాలంలో ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీ పేరుతో ఇసుక విక్రయాలపై అంక్షలు విధించింది. దీంతో ఇసుకాసురులు సిండికేట్‌గా మారి ఇసుక ధరలను భారీగా పెంచుతున్నారు. కాళేశ్వరం, ఏటూరునాగరం ఏరియాల్లో గోదావరి ఇసుక అన్ని పన్నులు కలుపుకొని టన్నుకు రూ.600కు లభిస్తుంది. అయితే అక్కడి నుంచి వరంగల్‌కు అయ్యే రవాణా ఖర్చులు కలుపుకొని రూ.800 వరకు విక్రయించాల్సి ఉంది. కానీ, ఇసుకాసురులు సిండికేట్‌గా మారి ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించి ధరలను భారీగా పెంచి విక్రయిస్తున్నారు. టన్ను గోదావరి ఇసుకకు రూ.1,800 నుంచి రూ.2,200 వరకు వసూలు చేస్తున్నారు. ఒక టన్నుకు రూ.వెయ్యి నుంచి రూ.1,400 వరకు అదనంగా పిండుతున్నారు. ఒక 12టైర్ల లారీలో 28 టన్నుల ఇసుక లోడ్ చేస్తారు. దీనికి టీఎస్‌ఎండీసీకీ రూ.10,976 వరకు డీడీ రూపంలో చెల్లిస్తారు. ఇదే ఇసుకను వరంగల్‌లో టన్నుకు రూ.2,200 చొప్పున 28టన్నులకు రూ.61,600కు విక్రయిస్తున్నారు. లారీ డీజిల్ ఖర్చు, డ్రైవర్ భత్యం పోగా, ప్రతిలారీ ఇసుక మీద రూ.30 వేలకు పైగా అదనంగా పిండుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక అమ్మకాలపై నియంత్రణ లేకపోవటంతో ఇష్టారాజ్యంగా ధరలు పెంచి విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే సిమెంట్ ధరలు సైతం బంగారం ధరలతో పోటీపడి పెరుగుతున్నాయి. మొన్నటి వరకు సిమెంట్ బస్తా రూ.320 వరకు విక్రయించారు. రెండు నెలలుగా సిమెంట్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. బంగారం ధరల మాదిరిగానే సిమెంట్ ధరలు కూడా రోజు రోజుకు మారుతున్నాయి. రూ.360కు బస్తా విక్రయించిన వ్యాపారులు శుక్రవారం ఒకేసారిగా రూ.50 అదనంగా పెంచి బస్తాకు రూ.410 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో పాటు కంకర, కరెంట్ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. రెండు, మూడు నెలల నుంచి ధరలను అదుపు చేయకపోవటంతో వ్యాపారులు ఇష్టారీతిన విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.



అంచనాలను మించుతున్న ఖర్చులు

గృహ నిర్మాణ సామగ్రి ధరలు పెరగటంతో సామాన్యులు విలవిలలాడుతున్నారు. వరంగల్ నగరంలో ఓ చోట 100గజాల స్థలంలో సుమారు రూ.20లక్షల అంచనా వ్యయంతో ఇళ్లు మొదలు పెడితే, పెరిగిన ధరల కారణంగా మరో రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వరకు అదనపు భారం పడుతోంది. దీంతో చాలా మంది ఇంటి నిర్మాణ పనులను మొదలు పెట్టినా మధ్యలో

మిగతా 8వ పేజీలో..

కూలీలకు భారీ డిమాండ్

ప్రతీ ఏటా కొత్త నిర్మాణాలు ఎక్కువగా వేసవిలోనే మొదలవుతాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు బిల్డర్ల అపార్ట్మెంట్‌లు, సొంతింటి నిర్మాణాలు కూడా వేసవిలోనే జోరందుకుంటాయి. కలిసి వచ్చే ముహూర్తాలతో పాటు వేసవిలో వ్యవసాయ పనులు తక్కువగా ఉండటంతో పాటు సెలవులు కూడా ఎక్కువగా ఉంటాయి. దీంతో చాలామంది వేసవిలోనే నిర్మాణ పనులు చేపడతారు. అయితే భవన నిర్మాణాల్లో పని చేసే కూలీల కొరత మరింత ఆందోళనకరంగా మారింది. చాలామంది భవన నిర్మాణాల్లో పనికి ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చాలా గ్రామాల్లో వేసవిలో మొదలయ్యే ఉపాధి హామీ పనులకు వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో పట్టణాల్లో కూలీల కొరత తీవ్రమవుతుంది. గతంలో మేస్త్రీకి రోజు కూలీ రూ.800 నుంచి రూ.1,000 వరకు ఇచ్చే వారు. అయితే ప్రస్తుతం మేస్త్రీల రేటు భారీగా పెంచారు. ప్రస్తుతం మేస్త్రీకి రోజు కూలీ రూ.1,200 నుంచి రూ.1,500 చెల్లిస్తున్నారు. అలాగే మహిళా కూలీకి గతంలో రూ.400, పురుషుడికి రూ.600 చెల్లించేవారు. ప్రస్తుతం మహిళకు రూ.500, పురుషుడికి రూ.800 వరకు కూలి చెల్లించాల్సి వస్తోంది.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : ఆదివారం సా : 6.35 గం..
సహర్ : సోమవారం ఉ : 4.42గం..

శనివారం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.5°C
కనిష్ఠం : 24.5°C

సరిహద్దులో అలజడి

కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌తో అప్రమత్తం
కూంబింగ్ ముమ్మరం చేసిన గ్రేహౌండ్స్ పోలీసులు

7

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దు..

- బోర్లు, చేతి పంపుల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలి
- మండల ప్రత్యేకాధికారులు సమీక్షలు నిర్వహించాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ గోపి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గోపి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 6: వేసవికాలం నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా తాగునీటి సరఫరా పరిశీలనపై నియమితులైన ప్రత్యేక అధికారి డాక్టర్ గోపి సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో శనివారం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో తాగునీటి సరఫరాపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి డాక్టర్ గోపి మాట్లాడుతూ.. జిల్లాలోని గ్రామాలు, ఆవాసాలకు తాగునీటి సరఫరాలో ఎక్కడ కూడా ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. వేసవికాలం దృష్ట్యా తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వాటిని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. బోర్లు, చేతి పంపుల ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బోర్లు, చేతిపంపులు. పైపులైన్ల మరమ్మతులతో పాటు కొత్తవి కూడా చేపట్టాలని, అవసరమైనచోట వ్యవసాయ బావుల ద్వారా తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. కిందటేడు కంటే ఈ యేడు తక్కువగా వర్షపాతం నమోదైందని, దీనివలన భూగర్భ జలాలు అడుగంటాయని, అయినప్పటికీ ప్రజలకు తాగునీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలాలకు నియమితులైన ప్రత్యేక అధికారులు ప్రతీరోజు తాగునీటి సరఫరా, నిర్వహణపై సమీక్షలు నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి గోపి సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు సమీక్షలు నిర్వహించి తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు.

అన్ని చర్యలు తీసుకుంటున్నాం..

హనుమకొండ జిల్లాలో తాగునీటికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బోర్లు, చేతిపంపులు, అవసరమైన చోట వ్యవసాయ బావుల ద్వారా త్రాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లో తాగునీటి సరఫరాకు గ్రామపంచాయతీల వారిగా కార్యాచరణ ప్రణాళికతో తాగునీటి సరఫరాకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో వ్యవసాయ బావుల ద్వారా రూ.కోటి నిధులతో 1300 చేతిపంపులు, బోర్‌వెల్స్ పైపులైన్ల మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రేటవర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ధర్మసాగర్ నుంచి మూడు ఫిల్టర్ బెడ్ల ద్వారా వరంగల్ మహానగరంలోని 66 డివిజన్లకు తాగునీటి సరఫరా జరుగుతోందన్నారు. ఏజెన్సీ ద్వారా ఎప్పటికప్పుడు లీకేజీలు, మరమ్మతు పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నగరంలో తాగునీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ జిల్లాలో తాగునీటి సరఫరా, నిర్వహణకు తీసుకుంటున్న చర్యల వివరాలను అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా వివరించారు. వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్‌డీఓ నాగ పద్మజ, డీపీఓ లక్ష్మీరమాకాంత్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, గ్రామీణ నీటి సరఫరా, మిషన్ భగీరథ, మున్సిపల్ కార్పొరేషన్ సంబంధిత శాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

ల్యాండ్‌ఫిల్ గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- సెజింగ్ కమిటీ ప్రతినిధులతో సమావేశం



కొరియా ప్రతినిధుల నుంచి వివరాలు తీసుకుంటున్న కమిషనర్

8

ఎల్బీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

న్యూశాయంపేట, ఏప్రిల్ 6 : ములుగురోడ్‌లోని లాల్‌బహదూర్ కళాశాల(ఎల్బీ)లో శనివారం ఎంబీఏ విద్యార్థులకు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు..

త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి

గూడూరు, ఏప్రిల్ 6 : దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని.. అవి మనిషిలో మంచి ప్రవర్తన తెచ్చే నిలయాలు కావాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి అన్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మదనాపురం గ్రామంలో శ్రీలక్ష్మి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి నూతన దేవాలయ విమాన గోపుర ధ్వజ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా శనివారం త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి ఆలయంలో పూజలు, ప్రవచనములు, భక్తుల ఆశీర్వాదం, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా చిన్నజీయర్‌స్వామి మాట్లాడుతూ.. దేవాలయాల్లో ప్రజలు, ప్రసాదాలే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉన్నాయని, అవి అందరికి మంచి చేసేలా ఉపయోగపడాలన్నారు. దేవాలయాలు, వాటిలో విగ్రహాలు మనస్సుకు అద్దంలా నిలుస్తాయన్నారు. మన ఆలోచన విధానంలో మార్పు తీసుకువచ్చేదే మంత్రమన్నారు. మంత్రం అంటే తరించే వారికి రచించేదేనని చెప్పారు. మనుషులు, జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు చూస్తే అన్ని వేర్వేరే. కానీ, కలిసి సాగితే సుఖ జీవనమన్నారు. మంచి జీవితం కావాలంటే సహజీవనం అవసరం, అదే సమతా భావమని పేర్కొన్నారు. సమాజంలో ఎన్నో వికార పోకడలు, నేనే గొప్ప, నేనే నిలువాలన్న స్వార్థ చింతనలు పెరిగిపోయాయని చెప్పారు. ఈ తీరు మారాలి. మన ఇల్లు, మన ఊరు, సమాజం, దేశం, ప్రపంచమంతా సంతోషంగా ఉండాలన్నారు. ప్రకృతిలో మనిషే కాదు.. చెట్లు, జంతువులు, సూక్ష్మజీవులు ఎన్నో ఉన్నాయి.. అవి లేకుండా మనిషి ఉండలేడు, కానీ మనిషి లేకుండా అవి ఉండగలవన్నారు. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో మనిషి ఇంటికే పరిమితమైతే ప్రకృతి పరవశించిన విషయాల్ని కళ్లారా చూశామని తెలిపారు. అందుకే మనం పదిలంగా ఉండాలంటే వాటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అద్దం ఎట్లయితే ముఖాన్ని చూపిస్తుందో.. అలాగే విగ్రహం మనిషి మనస్సులోని దేవుడిని చూపిస్తుందన్నారు. అర్థమండపం ఎట్లా ఉండాలి, ముఖ మండపం ఎట్లా ఉండాలి, దేవాలయంలో గజ, జయ, ధ్వజ స్తంభాల వద్ద నమస్కారం చేసిన తర్వాత గర్భగుడిలో ఉన్న దేవతామూర్తుల వద్ద మొక్కులు చెల్లించుకోవాలని చెప్పారు. ప్రతీ వస్తువులో దేవుడు దాగి ఉన్నాడని, రాతి, లోహం, విగ్రహం, వస్త్రం, మట్టితో చేసిన బొమ్మలో సైతం దేవుడిలా కొలుస్తారని పేర్కొన్నారు. కదిలే ప్రాణులు, మనుషులకు, కదల్లేని ప్రాణులు, చెట్లు వాటికి స్థావరాలుగా ఉంటాయన్నారు. గ్రామంలో సంపదకు లోటు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. శిలాలోహం భగవంతుడి స్వరూపాలేనని అన్నారు. దేవాలయంలో విగ్రహాలు, శిల, ఉత్సవ రూపంలో ఉంటాయని స్పష్టం చేశారు.



చిన్నజీయర్‌కు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

సుధీర్‌రెడ్డి సేవలు భేష్..

మదనాపురం గ్రామంలో దేవాలయం ఉండాలని ఆకాంక్షించి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, గోశాల, గ్రామ దేవతలకు ఆలయాలు నిర్మించిన లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులను శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి అభినందించారు. గ్రామంలో ఆధ్యాత్మిక సేవలు చేయడం సంతోషకరమన్నారు. ఉన్న ఊరును మరిచిపోకుండా ప్రజల సుఖసంతోషాల్లో భాగస్వాములు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. రూ.1.50 కోట్ల సొంత ఖర్చులతో ఆధ్యాత్మిక ఆలయాలను నిర్మించడం అభినందనీయమన్నారు. దేవాలయంలో అన్ని వసతులను కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో లింగాల రోహిత్‌రెడ్డి-అనుపమ దంపతులు, లింగాల నితిన్‌రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఎల్.నర్సింహారెడ్డి, మానుకోట ఎంపీ మాలోతు కవిత, హరిత, మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్, గూడూరు సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనివాస్‌రెడ్డి, సనాతన శివాలయం చైర్మన్ ఏపూరు రవీందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కంభంపాటి ప్రతాప్, మేరెడ్డి సురేందర్, యాదవరెడ్డి, రణధీర్‌రెడ్డి, బోడ కిషన్, మోతీలాల్, చెల్పూరి వెంకన్న, బండి వెంకన్న పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయానికి వస్తున్న చిన్న జీయర్‌స్వామి

సరిహద్దులో అలజడి

కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌తో అలర్ట్

కూంబింగ్‌ను ముమ్మరం చేసిన గ్రేహౌండ్స్ పోలీసులు

ములుగు, ఏప్రిల్ 6: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు పూజారి కాంకేర్ పరిధి కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్ జిల్లాలో అలజడి సృష్టించింది. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందడం, అందులో భూపాలపల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన సంతోష్ అలియాస్ సాగర్ ఉండటం సంచలనం కలిగించింది. దీంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. ఆదిలాబాద్-మహారాష్ట్ర సరిహద్దులో ఇటీవల భారీ ఎన్‌కౌంటర్ జరిగి 13 మంది మావోయిస్టులు హతమైన నేపథ్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జిల్లా పోలీసులు నిఘా పెంచారు. పౌరుల రాకపోకలపై కన్నేశారు. విస్తృతంగా వాహనాలను తనిఖీ చేయడంతోపాటు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను అలర్ట్ చేశారు. తాజాగా ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు వాజేడు మండలంలో సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతుండగా మావోయిస్టుల నుంచి ఎలాంటి అవాంఛనీయ ఘటన ఎదురవ్వకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిపించే విషయమై చర్చించినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.

ఈ సమావేశంలో మావోయిస్టులకు చెక్‌పెట్టే పలు అంశాలపై ఇరు రాష్ట్రాల పోలీసులు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నట్లు తెలిసింది. వ్యూహాత్మకంగా అడుగులు వేసే క్రమంలో కర్రిగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారంతో గ్రేహౌండ్స్ పోలీసులు శుక్రవారం నుంచి సెర్చ్ ఆపరేషన్ మొదలు పెట్టినట్లు తెలిసింది. ఈ బలగాలకు ములుగు జిల్లా పోలీసులు, సరిహద్దు స్టేషన్లలో సుదీర్ఘకాలం పనిచేసి ఈప్రాంతంపై అవగాహన ఉన్న అధికారులను రంగంలోకి దించినట్లు సమాచారం. అనుకున్నట్టుగానే పోలీసులు టార్గెట్‌ను రీచ్ అయ్యారు. దీంతో ఓ రాష్ట్రస్థాయి నాయకుడితోపాటు మొత్తం ముగ్గురు సభ్యులను మావోయిస్టులు కోల్పోయారు. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుండటంతో అక్కడి పోలీసులు మృతదేహాలను తరలించారు. ఈ ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరిస్తూ బీజాపూర్ ఎస్పీ జితేందర్ యాదవ్ ప్రకటన జారీ చేయగా కొద్దిగంటల వ్యవధిలోనే మావోయిస్టులు ఈ ఘటనపై స్పందించారు. ఆజాద్ పేరిట ఓ లేఖ విడుదలైంది. పక్కా సమాచారంతోనే పోలీసులు ఎన్‌కౌంటర్‌కు పాల్పడ్డారని, ములుగు ఎస్పీ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ జరిగిందని పేర్కొన్నారు.

అటవీ ప్రాంతంలో ఉద్రిక్తత

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని పూజార్ కాంకేర్ గ్రామ సమీపంలోని కర్రిగుట్టల అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో తెలంగాణ సరిహద్దు, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పుజార్‌కాంకేర్ గ్రామ సమీపంలోని కర్రిగుట్టల అటవీ ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులతోపాటు గ్రేహౌండ్స్ బలగాలు జాయింట్ యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడడంతో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతుల్లో సీపీఐ మావోయిస్టుపార్టీ సీఆర్‌సీ-2 (సెంట్రల్ రిక్రూట్మెంట్ కమిటీ) కమాండర్ అన్నె సంతోష్ అలియాస్ సాగర్ అలియాస్ శ్రీధర్, మరొకరు మణిరామ్ ఉండగా మిగిలిన మరొకరిని ఇంకా గుర్తించాల్సి ఉంది. మణిరామ్, మరొకరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పుజార్‌కాంకేర్ గ్రామానికి చెందినట్లు సమాచారం. బీజాపూర్ ఎస్పీ జితేందర్ యాదవ్ ఎన్‌కౌంటర్ విషయాన్ని ధ్రువీకరించగా ఊసూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఘటన ప్రాంతంలో ఒక ఏకే-47, ఎల్ఎంజీ, విప్లవ సాహిత్యం లభించగా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

రెండేళ్ల తర్వాత..

చివరిసారిగా 2022జనవరి 18న ఇదే కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి మడకం సింగి అలియాస్ శాంత, గుండాల-నర్సంపేట ఏరియా కమిటీ కమాండర్ కొమ్ముల నరేష్ అలియాస్ బుచ్చన్న, మరో మావోయిస్టు సభ్యుడు మృతిచెందాడు. పెద్దసంఖ్యలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే పక్కా సమాచారంతో రెండు రోజులుగా ఛత్తీస్‌గఢ్ సీఆర్పీఎఫ్, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఆరోజు ఉదయం 7గంటల ప్రాంతంలో మావోయిస్టులు-పోలీసుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. దాదాపు రెండుగంటల పాటు ఇరువర్గాల నడుమ కాల్పులు జరగగా గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మధుకు బుల్లెట్ గాయమైంది. కాగా, ఈ ఎదురుకాల్పుల ఘటన నుంచి వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి సుధాకర్ తప్పించుకున్నాడు. కాగా, మృతిచెందిన వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి శాంత సుధాకర్ భార్య.

అట్టుడుకుతున్న సరిహద్దు గ్రామాలు

మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉండే ఛత్తీస్‌గఢ్‌నుంచి తెలంగాణ సరిహద్దు మీదుగా నిత్యం నక్సల్స్ కదలికలు ఉంటాయి. పార్టీ కార్యకలాపాలను రాష్ట్రంలో విస్తరించే క్రమంలో మావోయిస్టులు సరిహద్దు దాటేందుకు ప్రయత్నించిన ప్రతీసారి తెలంగాణ పోలీసులు తిప్పికొడుతున్నారు. పోలీసులు లక్ష్యంగా అమర్చిన మందుపాతరలు, మారణాయుధాలను పెద్దఎత్తున స్వాధీనం చేసుకుంటున్నారు. ఈక్రమంలో ఎదురుకాల్పులు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో మావోయిస్టులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. గడిచిన నాలుగేళ్లలో జరిగిన ఎన్‌కౌంటర్ ఘటనలను పరిశీలిస్తే.. 2020 సెప్టెంబరు 3న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం దేవర్లగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మావోయిస్టు, 20వతేదీన చర్ల మండలం పూసుగుప్ప అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు, అదే నెల 23వతేదీన చర్ల మండలం జన్నారం అడవుల్లో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. అక్టోబరు 18న ములుగు జిల్లా మంగపేట మండలం కొప్పుగుట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో ఒకరు మణుగూరు ఏరియా కమాండర్ సుధీర్. ఇదేనెల 25న వాజేడు మండలం టేకులగూడెంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు, 2021 ఆగస్టు 1వతేదీన చర్ల మండలం బోదనెల్లి అటవీ ప్రాంతంలో ఒక మావోయిస్టు మృతిచెందాడు. డిసెంబరు 28న పెసళ్లపాడులో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతిచెందడం జరిగింది. తాజా ఎన్‌కౌంటర్‌తో సరిహద్దు పల్లెలు అట్టుడుకుతున్నాయి. ఆదివాసీ గూడాలు, గొత్తికోయ గుంపులపై పోలీసులు నిఘా పెంచారు. వాహనాల తనిఖీలను జరుపుతున్నారు. దీంతో చిట్టచివరి పల్లెల జనం భయాందోళనకు గురవుతున్నారు.

జోరుగా హుషారుగా..

రెండో రోజు కొనసాగిన స్ప్రింగ్ స్ప్రీ

నిట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ఆకట్టుకున్న పలు కార్యక్రమాలు, గేమ్స్

అలరించిన సినీ నిర్మాత, డైరెక్టర్ల టాక్ షో..

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6: బావి భారత ఇంజనీర్ల వసంతోత్సవ వేడుకల రెండోరోజు అదే జోష్ కొనసాగింది. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మసూద సినిమా నిర్మాత రాహుల్ యాదవ్ నక్క, గామి సినిమా డైరెక్టర్ విద్యాధర్ కాగిత అండ్ టీమ్ టాక్ షో అంబేద్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో కిక్కిరిసిన విద్యార్థులను అలరించింది. వరంగల్ నిట్‌లోని వివిధక్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం విద్యార్థులను ఉర్రూతలూగించాయి.



ఖల్‌నాయక్ ఈవెంట్ ప్రదర్శిస్తున్న దృశ్యం

ర్యాప్, నిట్ సోలో ఐడల్ అదరహో...

నిట్ మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాప్, నిట్ సోలో ఐడల్ కార్యక్రమం అదరహో అనిపించింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ర్యాప్ గీతాలు పాడుతూ శ్రోతలను ఆనందింపజేశారు.

వాట్స్ డిఫరెంట్.. మెదడుకు మేత..

యూత్ రెండ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మరో ఆట వాట్స్ డిఫరెంట్.. ఈ ఆటలో రెండు గదుల్లో నిర్వాహకులు వేర్వేరు ఛాయాచిత్రాలను ఉంచుతారు. రెండు గదుల్లోకి వెళ్లి వచ్చిన పార్టిసిపెంట్స్ వాటిని గుర్తుంచుకొని రాయాలి. లేదంటే ఈ ఆటలో ఓడిపోయినట్లే.

తెలుగు జిలుగుల చదరంగం..

తెలుగు లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్‌లో గోడకు కొన్ని బెలూన్లు అతికించి ఉంచారు. పాల్గొనదలచిన వారు బెలూన్‌ల లో ఒక్కదానిని పగలగొడితే అందులో ఓ టాపిక్ ఉంటుంది. ఆ టాపిక్ మీద తెలుగులో మాట్లాడాల్సి ఉంటుంది.

హంగర్ గేమ్స్.. ఫిట్‌నెస్‌పై గురి..

నిట్ ఫుడ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హంగర్ గేమ్స్ ఫిజికల్ ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందిస్తుంది. ఫిట్‌నెస్, ఆరోగ్యం ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఈ గేమ్‌ను నిర్వహించారు. పాల్గొనే విద్యార్థులు సిట్‌అప్స్, పుషప్స్ తదితర వ్యాయామ సంబంధ వర్కవుట్స్ చేయాల్సి ఉంటుంది.

మాస్టర్ చెఫ్... అదిరె వంటలు..

నిట్ ఫుడ్ క్లబ్ ఆధ్వర్యంలో వంటల గేమ్ ఏర్పాటు చేశారు. ఈ గేమ్‌లో ఒక బాక్స్‌లో వేసిన చిట్టీల నుంచి పాల్గొనే వారు అందులో నుంచి కొన్ని చిట్టీలను తీసుకొని అందులో రాసిన పదార్థాలతో రాతపూర్వక వంటను తయారు చేయాల్సి ఉంటుంది.

తక్‌దీర్‌కా ఆగే..

ఫన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్‌లో ఫొటో వెనకాల రాసి ఉన్న విషయాన్ని పాల్గొనే వారు చేయాల్సి ఉంటుంది. ఇందులో పాటలు, సంభాషణలు, నృత్యాలు తదితర అంశాలు ఉంటాయి.

ఖల్‌నాయక్.. ఏ సినిమాలో విలన్..

ఫిల్మ్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్ విద్యార్థుల్లో జోష్ నింపింది. పాల్గొన్న విద్యార్థులు ఫొటోల ఆధారంగా సంబంధిత ఫొటోలు ఉన్న వివిధ భాషల్లోని విలన్‌లు నటించిన చిత్రాల పేర్లు చెప్పాల్సి ఉంటుంది.

ఇంకా అనేకం..

నిట్‌లోని వివిధ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఇంకా వివిధ రకాలనైన ఫన్ గేమ్స్‌ను నిర్వహించారు. హిప్‌సోల్ క్విజ్, ఫాస్టెస్ట్ వన్ టూ గెస్, ఫిల్మ్ క్విజ్, యానిమీ మ్యూజియం, ఫొటో క్విజ్, మేళా, ఫిల్మ్ ట్రెజర్ హంట్, డంబ్ చార్‌డెస్ తదితర ఆటలు కొనసాగాయి.

స్ప్రింగ్ స్ప్రీలో నేటి కార్యక్రమాలు

తెలుగు సినిమా నటుడు, నిర్మాత నవదీప్ విద్యార్థులతో ముచ్చటిస్తారు. సీతారామం డైరెక్టర్ హను రాఘవపూడి డైరెక్టర్స్ కట్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తారు.

సినిమాల్లోకి వచ్చేయండి..

టాక్ షోలో మసూద సినీ నిర్మాత రాహుల్ యాదవ్ నక్క

సినిమా రంగంలోకి రావాలనిపించే యువ ఇంజనీర్లు దూకేయండి.. ఉత్సాహవంతులైన యువతను ప్రతీ రంగం ఆహ్వానిస్తుందన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుంటే ఉన్నతమైన విషయాలు నేర్చుకోవచ్చునన్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన తాను మొదటి గేమ్స్ రంగంలోకి వెళ్లాలనుకున్నానని, తర్వాత రాజకీయం వైపు వెళ్లాలని, ఆ తర్వాత సివిల్స్ కోసం ప్రిపేర్ అయ్యాను. అదీ చేతకాక చివరికి సినిమా రంగాన్ని ఎంచుకున్నాను. ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడే నాకంటూ ప్రత్యేకత ఉండాలనే భావన నాలో ఉండేది. అదే భావనతో సినిమా రంగంలోకి వచ్చాను. ప్రతీ వ్యక్తి ప్రయత్నాలు చేయాలని, ఆ ప్రయత్నాల్లో పొరపాట్లు సహజరంగా జరుగుతాయన్నారు. పొరపాట్లు చేయకుండా విజయాలు అందుకోలేమన్నారు. పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సినిమా రంగాన్ని ఎంచుకున్నాక మా నాన్న తనతో చాలా రోజులు మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. ప్రతీ రంగంలోనూ తప్పొప్పులుంటాయని, అయితే సినిమా రంగంలో ఇవి బయటపడుతాయన్నారు. నా పని నేను చేసుకుపోవాలనే స్వధర్మ ప్రొడక్షన్స్ స్థాపించాను. మంచి ప్రొడక్షన్ టీమ్ ఉంటే మంచి సినిమాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. బ్రహ్మానందం ఫుల్ లెన్త్ క్యారెక్టర్‌తో 'బ్రహ్మానందం' టైటిల్‌తో ఇంజనీరింగ్ బేస్డ్ లవ్ స్టోరీ పూర్తి కామెడీగా తీయబోతున్నట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌తో సినిమాలు వస్తాయన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు.

సృజన అద్భుత దృశ్యమానం గామి చిత్రం

చిత్ర దర్శకుడు విద్యాధర్ కాగితాల

హనుమకొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మక ఆలోచనలకు అద్భుత దృశ్యరూపమే గామి చిత్రం అని ఆ సినిమా దర్శకుడు విద్యాధర్ కాగితాల అన్నారు. చిత్ర బృందంలోని సభ్యులందరి సమిష్టి కృషి ఫలితంగానే ఈ చిత్రం ఊహించినదానికన్నా బాగా రావడమే కాకుండా అనూహ్య విజయాన్ని సాధించిందని ఆయన అన్నారు. స్ప్రింగ్ స్ప్రీ వేడుకల్లో భాగంగా శనివారం రెండో రోజు వరంగల్ నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ హాల్‌లో నిర్వహించిన డైరెక్టర్‌కట్స్ ఈవెంట్‌లో దర్శకుడు విద్యాధర్‌తో పాటు గామి చిత్ర బృందం పాల్గొన్నది.

ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ.. ఆలోచనలకు అక్షర రూపం ఇస్తే పుస్తకం అవుతుంది. సృజనకు దృశ్య రూపం ఇస్తే అది సినిమా అవుతుందన్నారు. గామి తెలుగు చిత్రపరిశ్రమలో ఒక నూతన వరవడిని సృష్టించిందని అన్నారు. మొదట తాను లఘు చిత్రాల దర్శకుడినని 2014 నుంచి 2017 మధ్య కాలంలో పలు షార్ట్ ఫిల్మ్‌లు తీశానని చెప్పారు. మెకానికల్ ఇంజనీర్ అయిన తాను యాంత్రికంగా ఉండలేక సృజనాత్మతకు వేదిక అయిన ఫిల్మ్‌మేకింగ్ వైపు అడుగులు వేశానని చెప్పారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో అనేక మంది ఫిల్మ్‌మేకర్లు ఉన్నారన్నారు. అవునా కాదా? మీలో ఎంత మంది ఫిల్మ్ మేకర్లు ఉన్నారని అడగ్గా పలువురు విద్యార్థులు చేతులెత్తారు. గామి చిత్రం తీయడంలో తమ చిత్ర బృందం ఎదుర్కొన్న సాదక బాధకాలను విద్యార్థులతో ఆయన పంచుకున్నారు. నిట్ ఫిల్మ్ అండ్ మ్యూజిక్ క్లబ్ సభ్యుడు సాయి శ్రీ చరణ్ విద్యార్థుల పక్షాన చిత్ర నిర్మాణానికి సంబంధించి అడిగిన పలుప్రశ్నలకు విద్యాధర్‌తోపాటు చిత్ర బృందంలోని మిగతా సభ్యులు సమాదానాలు ఇచ్చారు. ఈ డైరెక్టర్ కట్స్ పలు రౌండ్లుగా సాగింది. ఫన్ టైమ్ ఎమోజీ రియాక్షన్స్, చిత్రంపై మిమీస్, ఇష్టమైన సన్నివేశం మొదలైన వాటి గురించి అడిగిన ప్రశ్నలకు దర్శకుడితో పాటు చిత్రబృందం ఇచ్చిన సమాదానలకు విద్యార్థులు కేరింతలు కొట్టారు. నిట్‌లోని ఫిల్మ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ డైరెక్టర్ కట్స్ ఈవెంట్‌కు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థులతో హాల్ కిక్కిరిసిపోయింది. అనంతరం విద్యాధర్ అంతకు ముందు నిర్మించిన షార్ట్ ఫిల్మ్‌ను, అలాగే గామి ట్రైలర్‌ను ప్రదర్శించారు.



ధర్మారంలో వైద్య శిబిరం

గీసుగొండ, ఏప్రిల్ 6: ధర్మారం జెడ్పీ పాఠశాలలో డాక్టర్ రణధీర్, పాఠశాల పూర్వవిద్యార్థి నితిన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి, అనారోగ్యంతో ఉన్న వారికి మందులను అందించారు. వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబయ్య, డాక్టర్లు చిరంజీవి, అనూష, గణేష్, నవీన్, ల్యాబ్‌టెక్నీషియన్ వేణు, ఉపాధ్యాయులు కుమారస్వామి, వజ్ర, మాధవి పాల్గొన్నారు.


వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు

అండర్ బ్రిడ్జి ప్రాంతంలో పోకిరీల బెడద

కోటలో అసాంఘిక కార్యకలాపాలు

పట్టించుకోని పోలీసులు

ఆకతాయిల ఆగడాలు


కత్తికోటలోని ఓ గదిలో సిగరెట్ పీకలు,అగ్గిపెట్టెలు, మద్యం బాటిళ్లు

ఖిలావరంగల్, ఏప్రిల్ 6: నగరంలో ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొందరు యువకులు రోడ్లపైనే అర్ధరాత్రివేళ బర్త్‌డేలంటూ న్యూసెన్స్ సృష్టిస్తున్నారు. వేళపాలా లేకుండా గుట్కాలు, సిగరేట్లు, గంజాయి వంటి మత్తుపదార్థాలు విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఖిలావరంగల్ చెమన్‌వద్ద, కత్తికోట, ఖుష్‌మహల్ గ్రౌండ్, వాకింగ్ గ్రౌండ్, మధ్యకోటలోని బేకరీలు, బిర్యానీ సెంటర్‌లు, రిసార్ట్‌ల వద్ద, తూర్పుకోట శ్మశాన వాటిక, రాతి, మట్టికోట సమీపంలో, ఖమ్మంరోడ్, శివనగర్, అండర్‌బ్రిడ్జి, వరంగల్ రైల్వేస్టేషన్, కట్టమెసమ్మ దేవాలయం, చింతల్‌బ్రిడ్జి కింద, పుప్పాలగుట్ట, చింతల్, శంభునిపేట్, రంగశాయిపేట, ఉర్సు-బొడ్రాయి, కరీమాబాద్, ఓసిటి, మిల్స్‌కాలనీ, క్రిస్టియన్ కాలనీ, తదితర ప్రాంతాలలో అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు పెళ్లి బరాత్‌లలో మద్యం మత్తులో హల్‌చల్ సృష్టిస్తున్నారు. ఇళ్లలోని గద్దెలపై మద్యం బాటిళ్లను పగలగొడుతూ, ఇదేమిటని ప్రశ్నించే వారితో గొడవకు దిగుతున్నారు. అండర్ బ్రిడ్జి ప్రాంతంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. కొందరు నిర్వాహకులు అర్ధరాత్రి వరకు మద్యం విక్రయిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.


పనిచేయని సీసీ కెమెరాలు ఇవే

పనిచేయని సీసీ కెమెరాలు

అండర్ రైల్వేగేట్‌లోని చాటాచోట్ల సీసీ కెమెరాలు పనిచేయక అలంకార ప్రాయంగా మారాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడు సంబధిత పోలీసులు వచ్చి విచారణ చేసి వెళ్తున్నారే, కానీ పనిచేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టడం లేదు. వాహనాల ఆక్సిడెంట్లు, దొంగతనాలు, దోపిడీలు, గ్రూప్ తగాదాలు జరిగినప్పుడు సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో బాధితులకు సత్వర న్యాయం జరగడం లేదని నగరవాసులు వాపోతున్నారు.

కోట చుట్టూ అసాంఘిక కార్యలాపాలు..

పర్యాటక ప్రాంతమైన ఖిలావరంగల్ కోట చుట్టూ అసాంఘిక కార్యకలాపాలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. క్రీడాప్రాంగణాలు, వాకింగ్ గ్రౌండ్, నిర్జనప్రదేశాలు, రాతి, మట్టికోట సమీపంలో యువకులు మద్యం, సిగరెట్లు, గంజాయి వంటిని సేవిస్తున్నారు.


హోలీ పండుగ రోజున యువకుల గొడవ (ఫైల్)


ఖిలావరంగల్ మధ్యకోటలో ఇటీవల ఏర్పాటైన హోటళ్లు, బిర్యాని సెంటర్‌లు

ల్యాండ్‌ఫీల్ గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి

నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 6: ల్యాండ్ ఫీల్ గ్యాస్ ద్వారా విద్యుత్ (ఎల్‌పీజీ) ఉత్పత్తిని సహకారం అందిస్తామని గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో దక్షిణ కొరియాకు చెందిన సేజింగ్ కంపెనీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. కొరియా కంపెనీ ప్రతినిధులు మాట్లాడారు. విద్యుత్ ఉత్పత్తికి వేస్ట్ టూ కార్బన్ ఎనర్జీ కార్బన్ క్రెడిట్ అంశాల్లో ప్రత్యేకత కలిగి ఉన్నామన్నారు. కొరియాలో ఇప్పటికే 13 విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను విజయవంతంగా నడిపిస్తున్నామన్నారు. చైనా, వియత్నాం, థాయిలాండ్, ఉజ్బెకిస్తాన్ దేశాలలో ఎల్‌పీజీ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను నిర్వహిస్తున్న అనుభవం ఉందన్నారు. కాలుష్యం ఉండకుండా విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు చెప్పారు. వరంగల్‌లో ఉన్న పరిస్థితులను అవగతం చేసిన తర్వాత ల్యాండ్ ఫీల్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. రాంపూర్ డంపింగ్ యార్డ్ చెత్త, వ్యర్థాల నుంచి ఎల్‌పీజీ విడుదలవుతుందని, ఇలాంటి ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని అన్నారు. అనంతరం కొరియా ప్రతినిధులు డంపింగ్ యార్డ్‌ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సేజింగ్ కంపెనీ డైరెక్టర్ డీఫై కిం, అభిషేక్‌రాజ్‌తో పాటు సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ సంజయ్‌కుమార్, ఏఈ సంతోష్‌కుమార్‌లతో పాటు అధికారులు పాల్గొన్నారు.

డీటీసీని కలిసిన లారీ అసోసియేషన్ ప్రతినిధులు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 6: వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల భూపాల్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం శనివారం హనుమకొండలోని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(డీటీసీ) పుప్పాల శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. 15 ఏళ్ల దాటిన వాణిజ్య వాహనాలకు ఫిట్‌నెస్ ఫీజు పెంచిన ఉత్తర్వులపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాపీలను ఆయనకు అందజేశారు. ఫిట్‌నెస్ ఫీజును, రెన్యూవల్ ఫీజును పాత పద్ధతిలోనే వసూలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎండి. జాకీర్, ఎండి.హసెన్ తదితరులు పాల్గొన్నారు.


డీటీసీని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న లారీ అసోసియేషన్ ప్రతినిధులు

'రేవూరి.. అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి'

సంగెం, ఏప్రిల్ 6: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ పరకాల నియోజక వర్గ ఇన్‌చార్జి మంద రాజు డిమాండ్ చేశారు. సంగెంలో శనివారం ఎమ్మార్పీఎస్. ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల అత్యవసర సమావేశం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాల్ల రమేష్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ 'మందకృష్ణ మాదిగ బీజేపీకి అమ్ముడు పోయారు' అంటూ పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, తాటికాయల రమేష్, బాస్కాక కృష్ణ ప్రసాద్, ఓరుగంటి రమేష్, తూర్పాటి సారంగం పాల్గొన్నారు.

నిర్మాణ రంగం కుదేలు!

(5వ పేజీ తరువాయి)

నిలిపేస్తున్నారు. అప్పోసప్పో చేసి ఇల్లు కడుతామంటే మోయలేని భారంతో పాటు వడ్డీలతో నడ్డి విరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. సామాన్యులే కాకుండా బిల్డర్లదీ ఇదే పరిస్థితి. ముందే పాత ధరలకు అనుగుణంగా ప్లాట్లకు ముందే అడ్వాన్స్ తీసుకున్నారు. కానీ ప్రస్తుతం ఊహించినదానికంటే ఎక్కువగా ధరలు పెరగటంతో మధ్యలోనే అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులు నిలిపివేస్తున్నారు. ప్లంబింగ్, విద్యుత్ సామగ్రి ధరలు 30 శాతానికి పైగా పెరిగాయని, లేబర్ చార్జీలు 25శాతం వరకు పెరిగాయని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక, స్టీల్, సిమెంట్, కంకర ధరలతో అంచనాలు దాటడంతో నిర్మాణరంగం కుదలేవుతోంది.

గ్యాస్ ఫిల్లింగ్ విక్రయదారుల అరెస్టు

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 6: డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్ల నుంచి మోటార్ల ద్వారా అక్రమంగా చిన్న సిలెండర్‌లోకి ఫిల్ చేసి అధిక డబ్బులకు విక్రయిస్తున్న వారిని ఇంతేజార్‌గంజ్ పోలీసులు దాడిచేసి అరెస్టు చేశారు. గిర్మాజీపేటలో సూర్య ఎంటర్‌ప్రైజెస్ సంధ్య, సాయి గణేష్, గ్యాస్ సర్వీస్ సెంటర్లలో చిన్న సిలెండర్లలోకి మోటారు ద్వారా గ్యాస్ నింపుతుంగా ఇంతేజార్‌గంజ్ పోలీసులు, వరంగల్ డిప్యూటీ తహసీల్దార్, సివిల్ సప్లై సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నారు . పున్నంచందర్, అంకంశెట్టి రాజేష్, నూక నరేంద్ర స్వరూప్‌లను అదుపులోకి తీసుకున్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


దేశాయిపేటరోడ్‌లోని బీజేపీ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్న వెంకటరమణ


రంగశాయిపేటలో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న కొల్లూరి యోగానంద్ తదితరులు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 6: బీజేపీ ఆవిర్భావ వేడుకలను శనివారం నగర వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. దేశాయిపేట రోడ్‌లో ఉన్న బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర నాయకుడు వన్నాల వెంకట రమణ ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళలర్పించారు. నాయకులు కాసు శిల్ప, ముంద్రాతి వెంకన్న, తాబేటి వెంకట్ గౌడ్, జన్ను సుబ్రమణ్యం, విప్ప సుధాకర్, తోట సురేష్, గోవింద్ సింగ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

● కరీమాబాద్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా కరీమాబాద్‌లో టిఫిన్ బైటక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభుడు కుసుమ సతీష్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి ఈ పది సంవత్సరాల్లో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను చేరవేసిందన్నారు. 41, 42వ డివిజన్లలో బీజేపీ నాయకుడు కొల్లూరి యోగానంద్ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. హరిజనవాడలో, రంగశాయిపేట బొడ్రాయి సెంటర్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో 41వ డివిజన్ అధ్యక్షుడు కర్ని వాసుదేవ్, వరుణ్, జనార్ధన్, సుదర్శన్, యూసుఫ్, రాజేష్, మంద శ్యాం, గాదె ప్రవీణ్, అరుణ్, 42వ డివిజన్ శ్రీరామ్ మోహనాచారి, పరమేశ్వర్, బోయినరాజు, అశోక్, బాబురావు, రాజేష్ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: ఖిలావరంగల్ తూర్పుకోటలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాంద్రే అమర్‌నాథ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. డివిజన్ జోన్ ఇన్‌చార్జి కందిమళ్ళ మహేష్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి మేకల అనిల్, యువమోర్చా అధ్యక్షుడు గట్టికొప్పుల వంశీ, కిసాన్ సెల్ అధ్యక్షుడు బేర నరే ందర్, బూత్‌ల అధ్యక్షులు పాల్గొన్నారు

ఊకల్ సొసైటీ నెగ్గిన అవిశ్వాసం

కోర్టును ఆశ్రయించడంతో.. తీర్పు రిజర్వు

గీసుగొండ, ఏప్రిల్ 6: మండలంలోని ఊకల్ రైతు సేవా సహకార సంస్థ చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. సొసైటీలో మొత్తం 13 మంది డైరెక్టర్‌లు ఉండగా అందులో 9 మంది బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చైర్మన్ వీరస్వామి, వైస్‌చైర్మన్ చల్లా కృష్ణారెడ్డిలపై అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డికి తీర్మాన నోటీస్ ఇచ్చారు. కాగా శనివారం అవిశ్వాసంపై ఓటింగ్ పెట్టగా 9 మంది తీర్మానానికి మద్దతు ఇచ్చారు. చైర్మన్ మండల వీరస్వామి, వైస్ చైర్మన్ కృష్ణారెడ్డిలు హైకోర్టును ఆశ్రయించగా ఈనెల 23వరకు స్టే ఇచ్చింది. దీంతో అధికారులు ఓటింగ్‌ను ప్రకటించకుండా రిజర్వు చేశారు.

వాగ్దేవిలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

సంగెం, ఏప్రిల్ 6 : బొల్లికుంటలో వాగ్దేవి ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో శనివారం వాగ్దేవి క్రికెట్ ట్రోఫీ పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రారంభ మ్యాచ్ ఎస్ఆర్ యూనివర్సిటీ వర్సెస్ బిట్స్ కళాశాల టీంల మధ్య పోటీ జరిగింది. ఎస్ఆర్ టీం 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేయగా, బిట్స్ 18 ఓవర్లలో 172 పరుగులకే ఆల్‌ఔట్ అయింది. యస్ఆర్ విద్యార్థి పంతగాని రిష్యంత్ 41 బంతుల్లో 71 పరుగులు చేసి 1 వికెట్ పడగొట్టి ఆకట్టుకున్నాడు. ఈనెల 10 వరకు వరంగల్ కిట్స్ కళాశాల, శ్రీచైతన్య క్యాంపస్-2, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల, శ్రీచైతన్య కళాశాల, జయముఖి ఇంజనీరింగ్ కళాశాల, వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్‌ల క్రికెట్ క్రీడాకారులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



వాగ్దేవిలో రిష్యంత్‌ను అభినందిస్తున్న క్రికెట్ క్రీడాకారులు

విద్యాప్రగతిలో మహిళలు భాగస్వాములు కావాలి: కలెక్టర్

గీసుగొండ, ఏప్రిల్ 6: పాఠశాల అభివృద్ధి, విద్యాప్రగతిలో మహిళలు భాగస్వాములు కావాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ(ఏఏపీసీ)ల విధివిధానాలపై గీసుగొండ జెడ్పీ పాఠశాలలో హెచ్ఎంలకు, ఏఏపీసీ చైర్మన్‌లకు శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మొత్తం 663 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 645 పాఠశాలల్లో ఏఏపీ కమిటీల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, పారిశుధ్య పనులు, తరగతి గదుల్లో విద్యుదీకరణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు వంటి మౌలిక వసతుల కల్పన కోసం ఏఏపీ కమిటీలను ప్రభుత్వ పాఠశాల్లో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో ఆయా మౌలిక వసతులను కల్పించేందుకు కమిటీలు కృషి చేయాలని సూచించారు. వస్తువులు కొనుగోలు చేసినపుడు మార్కెట్ ప్రైస్ కంటే తక్కువగా ఐఎస్ఐ స్టాండర్డ్ ఉండేలా చూసుకోవాలన్నారు. వీవో అధ్యక్షురాలు చైర్మన్‌గా, హెచ్ఎం కన్వీనర్‌గా, విద్యార్థుల తల్లులు సభ్యులుగా ఉండే ఏఏపీ కమిటీలు పాఠశాలల్లో ప్రాధాన్యత పనులను గుర్తించి తీర్మాణాలతో పనులు చేపట్టాలన్నారు. ఈనెల 10 లోపు గ్రౌండింగ్ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో వాసంతి, ఎంఈవో సత్యనారాయణ, ఎంఎన్‌వో రవిందర్, ఏఈ సుధాకర్, ఏపీఎం సురేష్, గెజిటెడ్ హెడ్మాస్టర్‌లు, వీవో అధ్యక్షులు, సీఆర్పీలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావిణ్య

అర్ధరాత్రి గుడిసెల తొలగింపు


తొలగించిన గుడిసెలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు, బాధితులు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 6: పైడిపెల్లి, కొత్తపేట శివారుల్లో ఎస్సారెస్పీ ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను శుక్రవారం అర్ధరాత్రి రెవెన్యూ అధికారులు, పోలీసులు వెళ్లి డోజర్ సాయంతో తొలగించారు. మూడో డివిజన్ పైడిపల్లి -కొత్తపేట శివారు ప్రాంతంలో ఎస్సారెస్పీ ప్రభుత్వ భూమిలో ఏడాది క్రితం సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెలను వేసుకున్నారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వద్దని, తొలగిస్తామని చెప్పినా వారు వినలేదు. ఈ క్రమంలో మార్చి 14న రాత్రి అధికారులు, పోలీసులు గుడిసెలను తొలగించేందుకు యత్నింగా, వస్తువులు పాడైపోతాయని అధికారులను అభ్యర్థించడంతో 15 రోజుల గడువు ఇచ్చారు. అయినా గుడిసెలను ఖాళీ చేయకపోవడంతో శుక్రవారం అర్ధరాత్రి వరంగల్ తహసీల్దార్ ఎక్బాల్, గీసుగొండ తహసీల్దార్ రియాజ్, ఏనుమాముల ఎస్‌హెచ్‌వో పులి రమేష్ ఆధ్వర్యంలో అధికారులు, పోలీసులు డోజర్లతో గుడిసెలను తొలగించారు.

'రైతు సంఘం సదస్సును విజయవంతం చేయాలి'


కరపత్రం ఆవిష్కరిస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

గిర్మాజీపేట, ఏప్రిల్ 6 : వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరకు చట్టబద్ధత, రైతాంగాన్ని సంక్షోభం నుంచి రక్షించాలనే డిమాండ్లతో 26న తెలంగాణ రైతు సంఘం జిల్లా సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రైతు సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం అబ్బనికుంట రైతు భవనంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఒదెల రాజయ్య, నాయకులు అంబయ్య, అంశాల్ రెడ్డి, బుచ్చిరెడ్డి, దామోదర్ రెడ్డి, విజేందర్, రవిందర్, ఎల్లయ్య, సుధాకర్,ప్రభాకర్,రాజులతో కలిసి సదస్సు కరపత్రంను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వర్గాలకు అనుకూల,రైతాంగ వ్యతిరేక విధానాలను అమలు చేస్తుండటంతో దేశంలో వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. సదస్సుకు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్, తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, రిటైర్డ్ ప్రొఫెసర్లు కె.వెంకటనారాయణ, ఎం.యాదగిరా చార్యులు పాల్గొంటారన్నారు.

బెల్టు షాపులపై దాడులు

● రూ.25వేల విలువ చేసే మద్యం స్వాధీనం

కరీమాబాద్, ఏప్రిల్ 6: ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా మద్యం నిలువచేసి విక్రయిస్తున్న బెల్టుషాపులపై మిల్స్‌కాలనీ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఏసీపీ నందిరామ్‌నాయక్ నేతృత్వంలో దాడులు నిర్వహించి రూ.25వేలు విలువచేసే అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీతోపాటు, సీఐ మల్లయ్య తెలిపారు. బీఆర్‌నగర్, కాశికుంట, ఖిలావరంగల్ పశ్చిమకోటలో రెండు చోట్ల బెల్టుషాపులపై ఈ దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. దాడుల్లో ఎస్సైలు గోవర్ధన్, మునీరుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రకాళి సన్నిధిలో జాయింట్ డైరెక్టర్ ఇందిర

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 6: శ్రీభద్రకాళి అమ్మవారిని రాష్ట్ర ఆడిట్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఇందిర శనివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి రాగా అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాలను ఈవో శేష భారతి జాయింట్ డైరెక్టర్‌కు అందజేశారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జేడీ ఇందిర

తుక్కుగూడ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు


కాశిబుగ్గలో జెండా ఊపి ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నరేంద్రకుమార్


ఓసిటీలో జెండా ఊపి ప్రారంభిస్తున్న మీసాల ప్రకాస్,నల్గొండ రమేష్


ఓసిటీలో జెండా ఊపి ప్రారంభిస్తున్న మీసాల ప్రకాష్,నల్గొండ రమేష్

వరంగల్ సిటీ, ఏప్రిల్ 6: రాష్ట్రంలో ఎన్నికల శంఖారావం పూరించేందుకు కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడలో తలపెట్టిన భారీ బహిరంగ సభకు నగరం నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు శనివారం తరలివెళ్లాయి. 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ కాశిబుగ్గలో కాంగ్రెస్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఓసిటీలో టీపీసీసీ నాయకులు మీసాల ప్రకాష్, నల్గొండ రమేష్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఏనుమాముల 14వ డివిజన్ నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తుక్కుగూడ సభకు బయలుదేరి వెళ్లారు.

● సంగెం: సంగెం నుంచి తుక్కుగూడకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్లే బస్సును ఎంపీపీ కందకట్ల కళావతి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, రాజు, మల్లయ్య, నాగరాజు, సారంగం, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, రాజేష్, వంశీ, శ్రీనివాస్, కుమారస్వామి పాల్గొన్నారు. అలాగే, 43వ డివిజన్ తిమ్మాపురం హవేలి, మామునూరు గ్రామాల నుంచి నాయకులు తుక్కుగూడకు తరలి వెళ్లారు. ఆర్టీఏ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ జంక్షన్ నుంచి వెళ్లనున్న బస్సును కార్పొరేటర్ భర్త ఈదురు విక్టర్ ప్రారంభించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలకోట్ల రవీందర్, నాగరాజు, ప్రభాకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: నగరంలోని 34వ డివిజన్ శివనగర్ కాంగ్రెస్ నాయకుడు పగడాల సతీష్ పార్టీ జెండా ఊపి బస్సులలో తుక్కుగూడ మహాసభకు బయలు దేరారు. కార్యక్రమంలో నాయకులు అబ్బోజు తిరుపతి, మంద అక్షిత్‌పటేల్, సముద్రాల రవిచందర్, తోట నాగరాజు, శెట్టి అరుణ, మంతెన సంధ్య, గజ్జి విజయ, పాక సోమలక్ష్మి పాల్గొన్నారు. అలాగే 35వ డివిజన్ శివనగర్ నుంచి తుక్కుగూడకు తరలివెళ్ళారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు రేణికుంట్ల శివ, కొత్తపెల్లి శ్రీనివాస్, గంపగోవర్ధన్, రాజేష్, శ్రీరాం రాజేష్ పాల్గొన్నారు. క్రిస్టియన్‌కాలనీ నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లాయి.


శివనగర్‌లో సభకు బయలుదేరుతున్న కాంగ్రెస్ శ్రేణులు



మొరం తరలిస్తున్న టిప్పర్ బోల్తా


బోల్తాపడిన టిప్పర్

నెక్కొండ, ఏప్రిల్ 6 : మొరం తరలిస్తున్న ఓ టిప్పర్ మండలంలోని అప్పల్‌రావుపేట చెరువుకట్ట సమీపంలో నెక్కొండ-కేసముద్రం ప్రధాన రోడ్డులో శనివారం సాయంత్రం బోల్తా పడింది. గ్రామస్థుల కథనం ప్రకారం టిప్పర్ బోల్తా పడగా రెండు గంటలు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు సంఘటనా స్థలం నుంచి టిప్పర్‌ను గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. టిప్పర్ బోల్తాపడడంతో బీటీ రోడ్డు దెబ్బతినగా, టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని సంఘటన స్థలానికి చెరుకున్న ఎస్సై మహేందర్ తెలిపారు. ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు కృషి

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు : కలెక్టర్


అశోక్‌నగర్ హై స్కూల్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఖానాపురం, ఏప్రిల్ 6 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శనివారం మండలంలోని అశోక్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమి, ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, మన ఊరు మన బడి పనులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో మాట్లాడి కమిటీ విధి విధాలపై అవగాహన కల్పించారు. ఈ కమిటీల పేరిట పాఠశాలల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణం, వాటి మరమ్మతు పనులు, పాఠశాలల్లో పారిశుధ్య నిర్వాహణ తదితర అభివృద్ధి పనులు అమ్మ ఆదర్శ అభివృద్ధి కమిటీల తీర్మానంతో జరుగుతాయన్నారు. నిబంధనల ప్రకారమే కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అశోక్‌నగర్‌లో తాగునీటి సరఫరా తీరుపై క్షేత్రస్థాయిలో ఓవర్ హెడ్ ట్యాంకులను, చేతిపంపులను పరిశీలించారు. మిషన్‌భగీరథ తాగునీటి సరఫరా అనివార్య కారణాల వల్ల నిలిచిపోతే ప్రత్యామ్నాయంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మరమ్మతులకు గురైన బోర్లు, చేతి పంపులను వెంటనే బాగుచేయించాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తల్తెకుండా తీసుకోవాల్సి బాధ్యత ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులపై ఉందని, ప్రతీ రోజు గ్రామాలను సందర్శించి తాగునీటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కల్పన, జడ్పీసీఈవో రామిరెడ్డి, డీఈవో వాసంతి, రవీందర్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో భారతి, ఎంపీవో రవి, అధికారులు మౌనిక, మేనక, మంగీలాల్, సతీష్ పాల్గొన్నారు.

కార్మికులు దళారులను నమ్మి మోసపోవద్దు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 6 : కార్మిక శాఖలో అమలయ్యే పథకాలకు దరఖాస్తులను నేరుగా సంబంధిత కార్యాలయంలోనే అందజేయాలని, దళారులనునమ్మి మోసపోవద్దని డీసీఎల్ రమేష్ బాబు అన్నారు. పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో శనివారం జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. నర్సంపేట కార్మిక శాఖ కార్యాలయ పరిధిలోని కొంత మంది మీ సేవా నిర్వాహకులు డెలివరి, మ్యారేజ్, సహజ మరణం వంటి దరఖాస్తులు ఆన్‌లైన్‌చేయడానికి రూ.500 నుంచి రూ.1000 వరకు చార్జి చేయడంతో పాటు అధికారులకు తమకు దగ్గరగా ఉంటారని, స్వయంగా దరఖాస్తులను వారికి తాము అందజేస్తామంటూ నమ్మబలుకుతున్నార న్నారు. అలాంటి దళారుల మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. కార్మికులు ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను నేరుగా కార్మిక శాఖ కార్యాలయంలోనే అందజేసి రశీదు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోవర్ధన్, పాలడుగుల రమేష్, మోడెం మల్లేశం పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 6 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతులు పండించిన వరి పంటకు బోనస్ అందించాలని వర్ధన్నపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ మరియాసురేఖ అన్నారు. శనివారం పట్టణంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న క్వింటాకు రూ.2200 కనీస మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ చెల్లించాలని అన్నారు. కరువుతో నష్టపోయిన రైతులకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని, రైతు కూలీలకు రూ.12 వేలు బ్యాంకు ఖాతాలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్లమెంటు కార్యాలయం కార్యదర్శి పిట్టల శ్రీనివాస్, కరుణాకర్ పాల్గొన్నారు.

రిపోర్టర్లు రిమాండ్‌కు తరలింపు

రాయపర్తి, ఏప్రిల్ 6 : మండలంలోని కొలన్‌పెల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న వారిని సకాలంలో స్కూల్‌కు రావడంలేదని, మీపై పేపర్లలో కథనాలు రాస్తామని, అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరు రిపోర్టర్లను శనివారం రాయపర్తి పోలీసులు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వడ్డె సందీప్ కుమార్ తెలిపారు. రిపోర్టర్లుగా వ్యవహరిస్తున్న మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన ఎండీ ఇబ్రహీం, మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన కోటేశ్వర్‌లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బెల్టు షాపుల పై టాస్క్‌ఫోర్స్ దాడులు

రాయపర్తి, ఏప్రిల్ 6 : మండలంలోని కొండూరు, పెర్క వేడు గ్రామాల్లోని బెల్టు షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడు ల్లో కొండూరులోని పులి సోమయ్య ఇంట్లో రూ.19వేల అక్రమ మద్యం, పెర్కవేడులోని బొమ్మెర వీరన్న ఇంట్లో రూ.9,500 విలువల చేసే మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకున్నట్లు రాయపర్తి ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు.

చింతిస్తున్న చిందులు

ఆరు నెలలు రంగుల ప్రపంచంలో...
ఆరు నెలలు ఉపాధి పోరాటంలో...
అంతరిస్తున్న చిందు కళాపోషణ


నాటక ప్రదర్శన ఇస్తున్న కళకారులు (ఫైల్)

నెక్కొండ, ఏప్రిల్ 6 : గ్రామిణ ప్రాంతాల్లో ఆడి... పాడి... నవ్విస్తూ... ప్రేక్షకులను కనువిందు చేస్తూ చరిత్రను కళ్లకు కట్టి చూపిన చిందు కళాకారుల కళలకు నేటి అధునిక ప్రపంచంలో (ఇంటర్‌నేట్ కారణంగా) ప్రజాదరణ కరువై చిందుకల కళతప్పుతుండటంతో గడ్డు పరిస్థితిలో జీవన పోరాటం చేస్తున్నారు. సినిమా ప్రపంచం అంతగా తెలియని కాలంలో ఎన్నలేని ప్రజాదారణపొందిన చిందు కళలను సినిమా గ్రహణం కమ్మేయడంతో కళను నమ్ముకున్న చిందు కళాకారుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. దశాబ్దకాలం క్రితం ఎక్కువగా హరిజన కాలనీల్లో కళాప్రదర్శన ఇచ్చిన చిందు కళాకారుల కళలను గుర్తించిన హరిజనులు వారిని ప్రోత్సహించడంతో హరిజనులను అహ్లాద పర్చుటకు నాటక రంగంకు శ్రీకారం చుట్టారు. మొదట కాలక్షేప ప్రదర్శనలు ఇచ్చిన చిందు కళాకారులు వారి ఇదే వృత్తిగా ఎంచుకొని వారి కళకు పదును పెట్టారు. మహాభారతం, రామాయణం, పాండవ వనమాసం, సతీసావిత్రి, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణార్జునయుద్ధం, శివగంగ కళ్యాణం, అల్లిరాణి, ఋభవపురాణం, మండలీచరిత్ర వంటి అనేక పురాణ, ఇతిహాసాలను పామరులకు (నిరక్షరాస్యులు) అర్థమయే రీతిలో ప్రదర్శనలు ఇచ్చేవారు. అప్పటి అధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించిన సింధు కళాకారులు ఇతిహాసాలకు సంబంధించిన తెరలను (పరదాలను) నాటకాల సమయంలో స్టేజీలకు వెనుక వైపున మార్చుతూ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేవారు. అయితే కొంత కాలం తరువాత చిందు కళాకారుల కళలకు ఆకర్షితులైన హరిజనులతోపాటు ఇతర కులాల ప్రజలు కూడా గ్రామాల్లో ప్రదర్శనలు ఇవ్వాల్సిందిగా కోరేవారు. ఇందుకోసం వారికి ఆర్థిక సహాయం చేయడంతో ఆ రోజుల్లో చిందు కళలు ఎంతో ఆదరణ పొందేవి. కేవలం ఆరు నెలలు ప్రదర్శనలు ఇవ్వగా సంవత్సర కాలం వారి కుటుంబాల జీవనం గడిచేది.

మూడేళ్లకోసారి ప్రదర్శనలు


నెక్కొండలో ప్రదర్శన ఇచ్చిన చిందు కళకారుల బృందం (ఫైల్)

ఉమ్మడి వరంగల్ జిల్లా నెక్కొండ, కేసముద్రం, గుడూరు మండలాల్లోని గ్రామాలకు చెందిన దాదాపు ఇరవై కుటుంబాలు చిందు కళా ప్రదర్శనలు ఇస్తూ జీవనం సాగిస్తున్నారు. వరంగల్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ప్రదర్శనలు ఇస్తుంటారు. ఈ జిల్లాలోని గ్రామాలకు రొటేషన్ పద్ధతిన మూడు సంవత్సరాలకు ఒకసారి వెళ్లి ప్రదర్శనలు ఇవ్వడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. ప్రతీ సంవత్సరం జనవరి నెల నుంచి జున్ నెల వరకు చిందు కళాప్రదర్శనలు ఇస్తుంటారు. ఇందుకు గాను ప్రదర్శనలు ఇచ్చిన హరిజన కాలనీల్లో కులాల పాలుగా రూ.15వేల నుంచి రూ.20 వేలు ఇచ్చేవారు. ఇదే సమయంలో గ్రామస్థుల కోరిక మేరకు గ్రామాల్లో కూడా ప్రదర్శలు ఇవ్వడంతో కళాకారులకు ఆర్థికంగా గిట్టుబాటయ్యేది. నేడు ఆదరణ తగ్గడంతో చిందు కళాకారుల వారి జీవనోపాధికి గాను కేవలం హరిజన కాలనీల్లో మొక్కుబడి ప్రదర్శనలు ఇస్తున్నారు.

డమ్మీ ఆయుధాలు, పరదాల ఏర్పాటు భారం...

నాటకాలకు సంబంధించిన డమ్మీ ఆయుధాల బొమ్మల తయారు, కళాకారుల మేకప్, నాటకల ప్రదర్శన సమయంలో ప్రదర్శించే బొమ్మల పరదాలు, వాయిద్యాల ఏర్పాటు చిందు కళాకారులకు మోయలేని భారమౌతున్నాయి. దీనికి తోడు రవాణా ఖర్చులు కూడా పెరగడంతో కళాకారులందరిని అన్ని జిల్లాలకు తీసుకుపోవడం కష్టంగా మారింది. అలాగే ప్రదర్శనలకు సంబంధించి భారీ డైలాగులు, ఐదు నుంచి పది నిమిషాల సమయం పట్టే పద్యాలను కఠస్థం చేయడం చిందు కళాకారులకు వరం లాంటిదే. వయస్సుపై పడుతుండటంలో గ్లామర్ తగ్గడమే కాకుండా, జ్ఞాపకశక్తి తగ్గి పద్యాలు గుర్తు ఉండటం లేదంటున్నారు.

ఆదరణ తగ్గడంతో ఆర్థిక ఇబ్బందులు

గడ్డం వెంకటనర్సు, కళాకారుల బృందం అధ్యక్షుడు



వంశపారంపర్యంగా వస్తున్న చిందు కళను నమ్ముకున్న తమ కుంటుం బాలు ప్రదర్శనలు ఇచ్చి నా ఆదరణలేని కారణంగా పస్తులుంటున్నాము. సంవత్సరంలో ఆరు నెలలు ప్రదర్శనలు ఇవ్వగా వచ్చే ఆదాయం ఏ రోజుకారోజు పోషణకే సరిపోతుంది. మిగతా ఆరు నెలలు జీవనోపాధికి గాను కూలీ పనులను వెతుక్కోక తప్పడంలేదు. ప్రదర్శనలను ఇవ్వడానికి ఊరూర తిరగడంతో తమ పిల్లలు కూడా పెద్ద చదువులు చదువుకోలేదు. ఆదరణ తగ్గడంతో చిందు కళాకారులుగా రాణించలేక వారి భవిష్యత్తు అయోమయంగా మారుతోంది.

ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గడ్డం మొగిళి, మహిళ వేషధారణలో ఉన్న కళాకారుడు



ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ పిల్లలు చిందు కళకు దూరంగా ఉం టున్నారు. ఈ చిందుకళ తమ తరంతోటే అంతరించిపోయే ప్రమాదం ఉంది. చిందు కళాకారులను ప్రభుత్వం గుర్తించి ఆర్థిక సాయం, ప్రోత్సాహాన్ని అంది స్తే కళ అంతరించే ప్రమాదం తప్పుతుంది. ఉపాధికోల్పోతున్న కులాలను గుర్తించి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు నిధులను మంజూరు చేస్తున్నాయి. చిందు కళాకారుల ఆర్థికాభివృద్ధికి గాను కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

అటకెక్కిన సంక్షేమ పథకాలు...

రైతు నిరసన దీక్షలో మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, ఏప్రిల్ 6 : ఎన్నికల సందర్భంలో ఆచరణకు నోచుకోని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచిపోతున్నా, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎకరానికి రూ.500 వంతున ఇస్తానన్న బోనస్, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రెండు పంటలకు రూ.15వేల వంతున అందిస్తానన్న పెట్టుబడి సహాయం, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, కౌలు రైతులకు ఇస్తామన్న రూ.12వేలు నేటికి అందించ కుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసుందన్నారు. ఒక్క నర్సంపేట నియోజకవర్గంలోనే ఖరీఫ్, రబీలో వరిని పండించిన రైతులకు రూ.171 కోట్ల బోనస్ అందాల్సి ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో లక్షా 32వేల 500 ఎకరాల్లో వరి సాగు కాగా, ప్రస్తుత పాలకుల పాలనలో 95వేల ఎకరాల మేరకే సాగైందన్నారు. 40వేల ఎకరాల్లో రైతులు పంటను సాగు చేసుకోలేకపోయారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఉగాది పండగ నాటికి పాకాల, రంగాయ చెరువు ప్రాజెక్టుల ద్వారా ఎస్సారెస్పీ నీటితో నియోజకవర్గంలోని 292 చెరువులను నింపామని ఆయన పేర్కొన్నారు. నేడు కాంగ్రెస్ పాలనలో చెరువుల్లో నీరులేక రైతులు, మిషన్ భగీరథ నీరు అందక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట సాగుసమయంలో అధికారులతో సమీక్షలు నిర్వహించలేదని, అవగాహన రాహిత్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే ఒక్కపైసా మంజూరీ చేయించారా అని ప్రశ్నించారు. ప్రజలకిచ్చిన, రైతులకిచ్చిన హామీలు అమలయ్యే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని మండలాల ప్రజలు తాగునీటి కోసం, రైతులు సాగునీటి కోసం గోస పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోయామని ప్రజలు, రైతులు గమనిస్తున్నారని అన్నారు. తాను పార్టీ మారుతున్నానని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, బీఆర్ఎస్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాను తెలంగాణ ప్రాంతంలోని పార్లమెంట్ స్థానాల్లో తానే మొదటి విజయం సాధిస్తానని ఆమె ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ చైర్మెన్ గుగులోతు రామస్వామినాయక్, జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, నియోజకవర్గ నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్, మునిసిపల్ వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, రమేశ్‌యాదవ్, బాల్నె వెంకన్న, డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డితో పాటు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుక్కుగూడ సభకు తరలిన నాయకులు


తుక్కుగూడకు వెళ్తున్న వర్ధన్నపేట కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 6 : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తుక్కుగూడలో జరుగుతున్న భారీ బహిరంగ సభకు శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. పట్టణ అధ్యక్షుడు మైస సురేష్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. కట్ర్యాలలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సమ్మెట సుధీర్, తుమ్మల రవీందర్, మాజీ వార్డు సభ్యుడు సిలువేరు శ్రీధర్, ఐత యాకాంతం, అంజయ్య, బొంత కాంతం, బెజ్జం పాపారావు, రవీందర్‌రెడ్డి,కుమారస్వామి పాల్గొన్నారు.

● నల్లబెల్లి : తుక్కుగూడ సభకు మండల కేంద్రం నుంచి 15 ద్విచక్రవా హనాలను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి జెండాను ఊపి వాహనాలను ప్రారంభించారు. మండల నాయకులు మాలోతు రమేష్, వైనాల అశోక్, మామిండ్ల రాజిరెడ్డి, వెంగళదాసు రమేష్, మోహన్, మహేష్, అజ్మీర తిరుపతి, చిట్యాల ఉపేందర్‌రెడ్డి వెళ్లారు.

● దుగ్గొండి : మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు వాహనాలలో తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రైల బాబు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు ఒలిగె నర్సింగరావు, చెన్నూరి కిరణ్‌కుమార్, పాలడుగుల రాజయ్య, కాసర్ల బాబు తదితరులు ఉన్నారు.

● పర్వతగిరి : జన జాతర సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం భారీగా తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావులు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, రాంచందర్, శ్రీనివాస్, భాస్కర్, మహ్మద్‌అలీ, కొంరయ్య, రవి పాల్గొన్నారు.

● నెక్కొండ : తుక్కుగూడ జన జాతర బహిరంగ సభకు నెక్కొండ మండల కాంగ్రెస్ నాయకులు తరలి వెల్లారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాహనాల్లో నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. నర్సంపేట టీపీసీసీ మెంబరు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శివకుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల మైపాల్‌రెడ్డి, బాల్నె ప్రశాంత్ తదితరలు తరలివెళ్లారు.

● రాయపర్తి : జన జాతర బహిరంగ సభకు మండల కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. సభలో పాల్గొని సభ విజయవంతంలో తమవంతు కృషిచేశామని తెలిపారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు సభలో పాల్గొన్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వినయ్ కుమార్, అచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్, లింగాపురం, అక్కల్‌చెడ, మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తుక్కుగూడలో నిర్వహించే జన జాతర సభకు శనివారం తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు మాజీ సర్పంచ్‌లు సిద్దెన రమేష్, తప్పెట రమేష్, యూత్ అధ్యక్షుడు బండి హరీష్, మంద యాకయ్యగౌడ్ నర్సయ్య, మెంతుల రమేష్, కుండె కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు


వర్ధన్నపేటలో మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 6: దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ వస్తేనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలోని దమ్మన్నపేట, దివిటిపెల్లి, రామవరం, ఉప్పరపెల్లి గ్రామాలతో పాటు పట్టణంలోని పలు వార్డుల్లో బీజేపీ ఆవిర్భావ వేడుకలు వేరు వేరుగా ఘనంగా నిర్వహించి, పార్టీ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో మోదీ మేనియా నడుస్తోందని, కాంగ్రెస్ ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పినా ప్రజలు వినే పరిస్థితిలేదన్నారు. రానున్న రోజుల్లో పేద ప్రజల భవిష్యత్, యువత భవిష్యత్తును మోదీ తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, మండల పార్టీ అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి, కౌన్సిలర్ కొండేటి అనితసత్యం, గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, నేరెల్లి కుమార్, అర్జున్, గిరిప్రసాద్, పెద్దూరి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

● నర్సంపేట : త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో


బీజేపీ జెండాను కార్యకర్తలతో కలిసి ఎగురవేసిన గోగుల

బీజేపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అజ్మీర సీతారాం నాయక్‌కు నర్సంపేట నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీ అందించాలని నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మన్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. పట్టణంలో శనివారం బీజేపీ 44వ ఆవిర్భావ దినో త్సవం సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. బూత్‌స్థాయి నుంచి పార్టీ పటిష్ఠతకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, కౌన్సిలర్లు బోడ గోల్యానాయక్, మినుముల రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజు, గూడూరు సందీప్, ఉపాధ్యక్షుడు ఠాకూర్ విజయ్ సింగ్, శివాన్షన్‌సింగ్, సాంబమూర్తి పాల్గొన్నారు.

● ఖానాపురం : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, 10 సంవత్సరాల కాలంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీజేపీకి మద్దతుగా నిలవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో టిఫిన్ బైటక్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి జల్లి మధు, నర్లపురం పాపయ్య, ఆటిక కుమారస్వామి, బూడిద ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

● పర్వతగిరి : బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, రాష్ట్ర గిరిజనమోర్చా కార్యవర్గ సభ్యుడు హర్కావత్ వినోద్‌కుమార్, నాయకులు రంగు కుమార్, బత్తిని దేవేందర్, పట్టాపురం ఏకాంతం, సంతోష్ కుమార్, మధు, రవి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వర్ధన్నపేటరూరల్, ఏప్రిల్ 6 : పట్టణంలో ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్‌సాగర్ ప్రారంభించి మాట్లాడారు. కేంద్రాలకు వచ్చేరైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని, దళారుల మాటలు నమ్మొద్దని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపాలిటీ కమిషనర్ ఇ.జోనా, ఆర్ఐ కృష్ణ పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఈవో చిట్టి రవి అన్నారు. శనివారం ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఎల్లాయిగూడెం, పాపయ్యపేట, మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి, సొసైటీ డైరెక్టర్‌లు రాజు, మహేందర్ రెడ్డి,

ల్యాండ్‌ఫీల్ గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి

• నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 6: ల్యాండ్ ఫీల్ గ్యాస్ ద్వారా విద్యుత్ (ఎల్‌పీజీ) ఉత్పత్తిని సహకారం అందిస్తామని గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో దక్షిణ కొరియాకు చెందిన సేజింగ్ కంపెనీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. కొరియా కంపెనీ ప్రతినిధులు మాట్లాడారు. విద్యుత్ ఉత్పత్తికి వేస్ట్ టూ కార్బన్ ఎనర్జీ కార్బన్ క్రెడిట్ అంశాల్లో ప్రత్యేకత కలిగి ఉన్నామన్నారు. కొరియాలో ఇప్పటికే 13 విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను విజయవంతంగా నడిపిస్తున్నామన్నారు. చైనా, వియత్నాం, థాయిలాండ్, ఉజ్బెకిస్తాన్ దేశాలలో ఎల్‌పీజీ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను నిర్వహిస్తున్న అనుభవం ఉందన్నారు. కాలుష్యం ఉండకుండా విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు చెప్పారు. వరంగల్‌లో ఉన్న పరిస్థితులను అవగతం చేసిన తర్వాత ల్యాండ్ ఫీల్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. రాంపూర్ డంపింగ్ యార్డ్ చెత్త, వ్యర్థాల నుంచి ఎల్‌పీజీ విడుదలవుతుందని, ఇలాంటి ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని అన్నారు. అనంతరం కొరియా ప్రతినిధులు డంపింగ్ యార్డ్‌ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సేజింగ్ కంపెనీ డైరెక్టర్ డీవై కిం, అభిషేక్‌రాజ్‌తో పాటు సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ సంజయ్‌కుమార్, ఏఈ సంతోష్‌కుమార్‌లతో పాటు అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ మ్యాచ్‌లు చూస్తూ జల్సాలు చేస్తున్న రేవంత్‌రెడ్డి


వర్ధన్నపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 6 :ఓ వైపు రాష్ట్రంలో కరువు తాండవమాడుతూ, రైతుల పంట పొలాలు ఎండుతుంటే రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, వారి మంత్రులు క్రికెట్ మ్యాచ్‌లు చూస్తూ జల్సాలు చేస్తున్నారని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. శనివారం వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ చేపట్టిన దీక్షా దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పొలం బాట పేరిట రైతుల దుస్థితిని తెలుసుకుంటున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రజల వద్దకు వస్తున్నారని తెలియడంతో అక్రమ కేసులు బనాయించేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఈడీ, సీబీఐ పేరిట బెదిరింపులకు దిగుతుండగా, ఇటు రాష్ట్రంలో మేమేం తక్కువ కాదనే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ ఇతర కేసులు పెట్టి మనోధైర్యం దెబ్బతినే విధంగా చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వంద రోజులు గడిచిందని, ఇప్పటివరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప ఇతర హామీలను నెరవేర్చడం లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులు లేక కేసీఆర్ తయారు చేసిన గులాబీ సైనికులను పార్టీలోకి తీసుకుని ఎంపీ అభ్యర్థులుగా నిలబెడుతున్నారని విమర్శించారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి సిగ్గులేకుండా పదేండ్ల పాటు బీఆర్ఎస్ పార్టీలో పదవులు అనుభవించి తన కూతురు కోసం పార్టీ మారాడని పేర్కొన్నారు. నీతి నిజాయితీకి నిదర్శనమని చెప్పే కడియం శ్రీహరి గులాబీ సైనికులను వెన్నుపోటు పొడిచి దిగజారిపోయాడన్నారు. ప్రజలకు క్షమాపణ చెప్పి, వెంటనే ఎమ్మెల్యే పదవికి శ్రీహరి రాజీనామా చేయాలని, లేకపోతే ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు. బ్రాండ్ అని చెప్పడం కాదని, మాట మీద నిలబడాలని డిమాండ్ చేశారు. అరూరి రమేష్‌ను సైతం బీజేపీ తన పార్టీలోకి తీసుకుని బరిలో నిలిపిందని, కాలం అందరి భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ప్రజలు ఓటుతో బుద్ధి చెపుతారని అన్నారు. వీరందిరిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్‌లు మర్రి యాదవరెడ్డి, సుందర్ రాజ్, జిల్లా రైతు విభాగం అధ్యక్షురాలు లలిత కుమార్, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, బండి రజిని కుమార్, మునిసిపాలిటీ వైస్‌చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, కొండేటి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్లు మోటపోతుల మనోజ్ గౌడ్, హరిప్రసాద్, మాజీ కార్పొరేటర్ చింత యాదగిరి, జోరిక రమేష్, వీర భిక్షపతి, సిలువేరు కుమారస్వామి, ఎండీ రహీం, ఎండీ ఉస్మాన్, తక్కళ్లపెల్లి చందర్‌రావు, సర్వర్, గుజ్జ సంపత్‌రెడ్డి రెడ్డి, గుజ్జ గోపాల్‌రావు, పూజారి రఘు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగం కుదేలు!

(5వ పేజీ తరువాయి)

నిలిపేస్తున్నారు. అప్పోసప్పో చేసి ఇల్లు కడుతామంటే మోయలేని భారంతో పాటు వడ్డీలతో నడ్డి విరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. సామాన్యులే కాకుండా బిల్డర్లదీ ఇదే పరిస్థితి. ముందే పాత ధరలకు అనుగుణంగా ప్లాట్లకు ముందే అడ్వాన్స్ తీసుకున్నారు. కానీ ప్రస్తుతం ఊహించినదానికంటే ఎక్కువగా ధరలు పెరగటంతో మధ్యలోనే అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులు నిలిపివేస్తున్నారు. ప్లంబింగ్, విద్యుత్ సామగ్రి ధరలు 30శాతానికి పైగా పెరిగాయని, లేబర్ చార్జీలు 25శాతం వరకు పెరిగాయని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీగా పెరిగిన ఇసుక, స్టీల్, సిమెంట్, కంకర ధరలతో అంచనాలు మించిపోతుండటంతో నిర్మాణరంగం కుదలేవుతోంది. సామాన్యుల సొంతింటి కల కలగానే మిగిలి పోయే పరిస్థితి ఏర్పడుతోంది.

ఆవుకు రెండు లేగదూడలు జననం



దుగ్గొండి, ఏప్రిల్ 6 : మండలంలోని తిమ్మంపేటకు చెందిన రైతు నంగి రమేశ్‌కు చెందిన ఆవుకు శనివారం రెండు (కవల) లేగ దూడలు జన్మించి క్షేమంగా ఉన్నట్లు పశువైద్యాధికారి బాలజీ వెల్లడించారు. స్థానిక పశువైద్యశాలలో రైతుకు చెందిన ఆవు రెండు దూడలకు జన్మనీయగా ఆవు, దూడలు క్షేమంగా ఉన్నట్లు డాక్టర్ తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 6: పట్టణంలోని ఏడవ వార్డులో గల అలివేలుమంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం జరిగింది. అర్చకులు శేషబట్టు ఫణి కుమార్, సంపత్ కుమారాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. వర్ధన్నపేట కౌన్సిలర్ పాలకుర్తి సుజాత సారంగపాణి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలుచేసి మొక్కులు చెల్లించారు.కార్యక్రమంలో స్థానికులు సమ్మెట శ్రీనివాస్ గౌడ్, అల్లమనేని కమలాకర్‌రావు, శ్రీనివాసరావు, గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.